

నేడు 'స్పందన'

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'స్పందన' సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్జీదారులు తమ సమస్యలను జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని కోరారు.

గోపిల గోలగోల

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో వివిధ రాజకీయ పార్టీల నుంచి వలసల బెడద రోజురోజుకూ అధికమవుతోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న రాజకీయ నాయకులు, కార్యకర్తలతో పాటు ఓటర్లకు సైతం కండువాలు కప్పి ఆయా పార్టీల్లోకి ఆహ్వానిస్తున్న తీరు కోనసీమ జిల్లాలో ముఖ్యంగా కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారింది. మూడు ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఎన్నికల బరిలో ఉన్న ఆశావహులైన అభ్యర్థులు కొన్ని రోజులుగా వలసలను ప్రోత్సహిస్తూ రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. గోడ మీద పిల్లి (గోపిలు) వాటంగా ఉన్న వారు ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకుంటున్నారు. ఒక్కోరోజు ఒక్కో పార్టీ నాయకులతో కండువాలు కప్పించుకుని, ఫొటోలు తీయించుకుని ప్రచారం చేసుకుంటుంటే మరో రోజు ఆ కండువాలు వేసుకున్న వారిని మళ్లీ తమ పార్టీలోకి ఆహ్వానిస్తూ ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వలసలను ప్రోత్సహిస్తున్న నాయకుల నుంచి అభ్యర్థుల వరకు వారికి తృణమో, ఫణమో సమర్పించుకుని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. మరి కొందరైతే ఎన్నికల డిమాండ్లను ముందుంచివారిని ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కొన్ని నియోజకవర్గాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వలసలు

జిల్లాలోని కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో వలసల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యానందరావు, ఆయన సోదరుడు జనసేన టిక్కెట్టు ఆశిస్తున్న బండారు శ్రీనివాసరావుతో పాటు ప్రభుత్వ విప్, వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఎవరికి వారే 'గోపి'లను ప్రోత్సహిస్తున్న తీరు ఆయా పార్టీల్లో చేరుతున్న వారికి లాభసాటిగా మారుతోంది. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఈ చేరికల మాటే ఎక్కువగా వినిపిస్తోంది. కొందరైతే పార్టీ మారే వారికి షడ్రుచోపేతంగా భోజనాలు పెట్టి శాలువాలు, కండువాలు కప్పి ఆహ్వానిస్తూ ప్రచార ఆర్బాటం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మూడు రాజకీయ పార్టీలకు చెందన ఆశావహులు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వలసలను ప్రోత్సహిస్తూ సభలు, సమావేశాలు నిర్వహిస్తూకండువాల మార్పిడి చేస్తున్నారు. ఇటీవల ఆలమూరు మండలం బడుగువానిలంకలో ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని స్థానికులకు నమ్మబలికి 200 మందికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కండువాలు వేసారంటూ తిరిగి వారంతా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. లబ్ధిదారులందరినీ పట్టాలు ఇస్తామని చెప్పి గోపాలపురంలోని తన ఇంటికి రప్పించుకుని వైసీపీ కండువాలు వేసి వారిని మభ్యపెట్టిందని, అయితే వాస్తవం తెలుసుకున్న బడుగువానిలంకకు చెందిన ప్రజలంతా తిరిగి టీడీపీలో చేరినట్టు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రకటించారు. ఇలా రోజుకో రాజకీయ పార్టీలోకి చేరుతూ ఆయా పార్టీల ఆశావహులను సైతం బురిడీ కొట్టిస్తున్నారు. నియోజకవర్గంలోని ఓటర్లకు సైతం కండువాలు కప్పి వారి పేర్లతో కూడిన జాబితాను ప్రచార మాధ్యమాలకు, సోషల్ మీడియాలోను విడుదల చేస్తున్నారు. అవి కొన్నిచోట్ల వికటిస్తున్నాయి. మరుసటి రోజు స్థానిక నాయకులు, నియోజకవర్గ స్థాయి నేతలు హుటాహుటిన అక్కడకు వెళ్లి మీరు పార్టీ ఎందుకు మారారంటూ వారిని మళ్లీ తిరిగి తమ పార్టీల్లోకి రప్పించుకునే ప్రయత్నాలు జోరందుకున్నాయి. ఎన్నికల కాలానికి ముందే కొత్తపేట నియోజకవర్గంలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులను ఆయా పార్టీల ముసుగులో ఉన్న ఓటర్లు వారిని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగిస్తున్నారు.





మొదటి ఫొటోలో... ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైసీపీ కండువాలతో మహిళా కార్యకర్తలు... రెండోది వారిని బలవంతంగా వైసీపీలో చేర్చుకున్నారని చెప్పి మరలా టీడీపీ కండువాలు కప్పిన తెలుగుదేశం పార్టీ కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు



ర్యాలిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్ పుల్లంరాజు వర్మ అనుచరులకు పార్టీ కండువాలు కప్పిన సత్యానందరావు, హరీష్‌మాధుర్, బుచ్చిబాబు

చంద్రబాబు పరిపాలనా దక్షతపై నమ్మకంతో...

వైసీపీ మాజీ సర్పంచ్ పుల్లంరాజు వర్మ ఆధ్వర్యంలో 400 మంది టీడీపీలో చేరిక

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో నిరంకుశ రాక్షసపాలనకు చరమగీతం పాడాలనే ఉద్దేశ్యంతోనే వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు నిరంతరం జోరుగా జరుగుతున్నాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు, అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు పేరిచర్ల నరసింహరాజు మనవడు, మాజీ సర్పంచ్ పేరిచర్ల పుల్లంరాజు వర్మ ఆ పార్టీకి రాజీనామా చేసి 400 మంది అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. తొలుత బండారు సత్యానందరావు, హరీష్‌మాధుర్, ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబులను ఊరేగింపుగా తోడ్కొనివచ్చారు. వేలాది మంది పార్టీ శ్రేణులు ఊరేగింపులో పాల్గొని నేతలపై పూలవర్షం కురిపించారు. బాణసంచా కాల్పులు, గారడి నృత్యాలతో నడుమ టీడీపీ జెండాలను చేతబూని జై తెలుగుదేశం, జై బండారు నినాదాలతో హోరెత్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలనా దక్షత, టీడీపీలో నమ్మకంతో పార్టీలో చేరిన వారందరికీ ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. జగన్ పాలనలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని రాక్షస పాలనను ప్రజలకు వివరించారు. టీడీపీ-జనసేన కూటమి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఎంతో సమర్థవంతగా పనిచేస్తున్న బండారు సార్వత్రిక ఎన్నికల్లో మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని నేతలు తమ ప్రసంగంలో మాట్లాడారు. అనంతరం మాజీ సర్పంచ్ పుల్లంరాజు వర్మ, ఆయన అనుచరులు 400 మందికి టీడీపీ కండువాలు కప్పి స్వాగతించారు. వసంతవాడ, దేవరపల్లిల్లోని క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్లపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహరావు, జుజ్జవరపు హరిబాబు, మెర్ల నాగేశ్వరరావు, పెండెం వెంకన్న, పాలంగి రవిచంద్ర, గూడపాటి శ్రీను, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫిజికల్ డైరెక్టర్ భీమేష్‌ను అభినందిస్తున్న జేసీ నుపూర్‌అజయ్

ముగిసిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4: అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో 'ఆడుదాం ఆంధ్రా' జిల్లా స్థాయి పోటీలు ముగిసాయి. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో ఈ పోటీలను నిర్వహించగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు మెట్టి గౌరీశంకరరాజులతో పాటు పీడీలు ఐ.భీమేష్, పాయసం శ్రీనివాసరావు, తోట రవి, ఉండ్రు ముసలయ్య, కామన గణేశ్వరరావు, వై.సంజీవయ్య, యెనుముల నరసింహారావు తదితరులను జిల్లా నోడల్ అధికారి, జేసీ ఎస్.నుపూర్‌అజయ్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయా పోటీల్లో విజేతలకు నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, షీల్డులు అందజేశారు. మెన్ ఖోఖో విభాగంలో అమలాపురం జట్టు ప్రథమ, మండపేట ద్వితీయ, పి.గన్నవరం తృతీయ స్థానాలు సాధించాయి. ఉమెన్ ఖోఖో విభాగంలో కొత్తపేట ప్రథమ, పి.గన్నవరంద్వితీయ, మండపేట తృతీయ స్థానాలు సాధించాయి. మెన్ వాలీబాల్ విభాగంలో రాజోలు జట్టు ప్రథమ, పి.గన్నవరం ద్వితీయ, కొత్తపేట తృతీయ స్థానాలు, ఉమెన్ వాలీబాల్ విభాగంలో పి.గన్నవరం ప్రథమ, రాజోలు ద్వితీయ, అమలాపురం తృతీయ స్థానాలు సాధించాయి. మెన్ కబడ్డీలో రాజోలు జట్టు ప్రథమ, అమలాపురం ద్వితీయ, కొత్తపేట తృతీయ, ఉమెన్ కబడ్డీలో రామచంద్రపురం ప్రథమ, ముమ్మిడివరం ద్వితీయ, కొత్తపేట తృతీయ స్థానాలు సాధించాయి. క్రికెట్ మెన్ విన్నర్‌గా రామచంద్రపురం, రన్నర్‌గా రాజోలు జట్లు నిలిచాయి. మండపేట తృతీయ స్థానం సాధించింది. బ్యాడ్మింటన్ విన్నర్‌గా అమలాపురం రన్నర్‌గా మండపేట, రాజోలు తృతీయ స్థానం సాధించింది. క్రికెట్ ఉమెన్ విన్నర్‌గా అమలాపురం, రన్నర్‌గా రాజోలు, కొత్తపేట జట్టు తృతీయ స్థానం సాధించింది. ఆయా పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు జేసీ నుపూర్‌అజయ్ ప్రకటించారు.

సాదాసీదాగా జడ్పీ మీటింగ్

అంతా మొక్కుబడే! అజెండా అంశాలపై చర్చ లేకుండా మమ..

ఉమ్మడి జడ్పీ సమావేశం జరిగిన తీరు ఇది.. ఎమ్మెల్యేలు రాక నామమాత్రంగానే...7లో

ఇసుక దోపిడీ



గోపాలపురం ఇసుక ర్యాంపులో యంత్రాల సాయంతో ఇసుకను లారీలో లోడు చేస్తున్న దృశ్యం



గోపాలపురం ర్యాంపులో పరిమితికి మించి ఇసుకను లోతుగా తవ్వడంతో ఏర్పడిన గోతులు

- నిబంధనలకు తూట్లు
- లారీల్లో పరిమితికి మించి లోడు
- రాత్రి, పగలు తేడా లేకుండా రవాణా
- బాట చార్జీల పేరిట అధికంగా వసూలు
- కానరాని అధికారుల పర్యవేక్షణ



రావులపాలెం, ఫిబ్రవరి 4: గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నదీ పరివాహకంలో ఇసుక తవ్వేందుకు నిబంధనలు పాటించాల్సి ఉన్నా అవేవీ ఇక్కడ కానరావట్లేదు. రావులపాలెం మండల పరిధిలోని గోపాలపురం, ఊబలంక ర్యాంపుల్లో నిబంధనలను తుంగలోకి తొక్కి. రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది లారీల్లో ఇసుక తరలించుకుపోతున్నారు. లారీల్లో పరిమితికి మించి ఇసుక లోడు చేసి రవాణా చేస్తున్నా అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడట్లేదన్న విమర్శలు సర్వతా వ్యక్తమవుతున్నాయి. గోదావరి సమీపంలో యంత్రాల సాయంతో తవ్వకాలు చేపట్టకూడదని ట్రిబ్యునల్ స్పష్టంగా ఇచ్చిన ఆదేశాలు ఇక్కడ బేఖాతరు అవుతున్నాయి. నదీ పరిరక్షణ చట్టం ప్రకారం మీటరు మించి లోతున తవ్వకాలు చేయకూడదు. అయితే మీటరుకు పైబడి రీచ్‌ల్లో ఇసుక తవ్వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దోపిడీకి అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. మూడు, ఐదు, ఆరు యూనిట్ల లారీల్లో పరిమితికి మించి లోడుతో జాతీయ రహదారిపై రవాణా చేస్తున్నా అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. రాత్రి, పగలు తేడా లేకుండా జాతీయ రహదారితో పాటు గ్రామీణ రహదారులపై ఇసుక లారీలు పరిమితికి మించి వేగంతో దూసుకుపోతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు హడలిపోతున్నారు. ఆరు యూనిట్ల లారీకి రీచ్‌లో లోడింగ్ చార్జీల పేరిట రూ.10,450 వసూలు చేస్తుండగా... అదనంగా బాటచార్జీల పేరిట రూ.300 వసూలు చేస్తున్నారని వాహనచోదకులు వాపోతున్నారు. నిబంధనలను తుంగలోకి తొక్కి. వందలాది లారీల్లో యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. దీంతో గోదావరికి వరదలు వచ్చిన సమయంలో పెను ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లౌకిక తత్వానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ ప్రభుత్వం

ఉప ప్రణాళిక పథకాలను రద్దు చేసిన జగన్... అమలాపురంలో జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పౌర హక్కుల సంఘం మహాసభలో వక్తలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4: భారత రాజ్యాంగంలోని లౌకికతత్వాన్ని తూట్లు పొడుస్తూ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందనిపౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ ఆరోపించారు. రాజ్యాంగంలో బడుగు, బలహీనవర్గాలకు స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు కేటాయించిన ఉప ప్రణాళికా నిధులను రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పౌరహక్కుల సంఘం 50 వసంతాల ఉద్యమ ప్రస్థానంలో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 17వ మహాసభ ఆదివారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో జిల్లెల్ల మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత పౌరహక్కుల ఉద్యమ ప్రస్తావనపై చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రజలను బానిసలు చేసేవిధంగా పాలకులు పాలన సాగిస్తున్నారని విమర్శించారు.పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు 'భారత రాజ్యాంగం-అమలుతీరు-మణిపూర్ మారణ హోమం' అంశంపై సుదీర్ఘంగా మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత విద్వేషాలు పెరిగిపోయాయన్నారు. మణిపూర్‌ను కాషాయీకరించేందుకు తెగల మధ్య చిచ్చుపెట్టి క్రైస్తవులను, ఆదివాసీల హక్కులను, ప్రాణాలను హరిస్తూ ఉన్మాదంతో చెలరేగిపోతున్నారని వివరించారు. పాలకులే మనుషుల జీవించే హక్కులను హరించి వేస్తున్నారన్నారు. ఆర్పీఐ జాతీయ కార్యదర్శి డీబీ లోక్, మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి వై.రాజేష్, డీబీఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు కొంకి రాజామణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కొండా దుర్గారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చా నాగయ్య, దీపాటి శివప్రసాద్, అమలదాసు బాబూరావు, కారెం వెంకటేశ్వరరావు, బొంతు రమణ, గణపతి మాట్లాడారు. హక్కుల సాధన కోసం జరిపే పోరాటాలకు సంఘీభావం తెలిపేందుకు నిర్ణయించారు. ఉమ్మడి జిల్లా పౌర హక్కుల సంఘం జిల్లా కన్వీనర్లుగా జిల్లెల్ల మనోహర్, ఓగూరి బాలాజీలను రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది.



ఉమ్మడి జిల్లా పౌరహక్కుల సంఘ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

సాదాసీదాగా జడ్పీ మీటింగ్


మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్


సమావేశానికి హాజరైన జడ్పీటీసీ సభ్యులు

అంతా మొక్కుబడే!
అజెండా అంశాలపై చర్చ లేకుండా మమ..
ఉమ్మడి జడ్పీ సమావేశం జరిగిన తీరు ఇది..
ఎమ్మెల్యేలు రాక నామమాత్రంగానే..

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: అంతా మొక్కుబడే.. అజెండా అంశాలపై చర్చ లేకుండానే మమ అనిపించారు.. ఎమ్మెల్యేలు రాకపోవడంతో సాదాసీదాగా జరిగిన చర్చ.. మొత్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. రానున్న వేసవిలో సాగునీటి, తాగునీటి ఎద్దడిపై కొందరు జడ్పీటీసీలు చర్చించారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కాకినాడ ఎంపీ వంగా గీత, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా అతిథులుగా విచ్చేశారు.

రెండున్నరేళ్లు పూర్తి

మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రానున్న వేసవిలో సాగు, తాగునీటికి రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ముందస్తు కార్యాచరణ చేపట్టాలని అధికారులను కోరారు. వేసవిలో తాగునీటి కార్యాచరణపై ఎంపీ గీత, రాజ్యసభ సభ్యుడు బోస్ మాట్లాడారు. జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, జిల్లా ప్రగతి సాధన అంశాల్లో తమ వంతు కృషి చేస్తూ జడ్పీ పాలక మండలి రెండున్నరేళ్ల కాలం విజయవంతంగా పూర్తి చేసుకుందన్నారు. ఇందుకు అన్ని విధాలా కృషి చేసిన సభ్యులు, సహకరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


ఎంపీలు వంగా గీత, బోస్

2024-25 అంచనా బడ్జెట్ ఆమోదం

అనంతరం 2023-24 సంవత్సరానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సవరణ బడ్జెట్, 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను చర్చ, ఆమోదం కోసం సభ ముందు ఉంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మేరకు వివిధ పద్దుల కింద రూ.883.34 కోట్ల ఆదాయం, రూ.882.79కోట్ల వ్యయం అంచనాలుగా రూ.55లక్షల మిగులుతో ప్రస్తుత 2023-24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలను, రూ.886.95కోట్ల ఆదాయం, రూ.886.33కోట్ల వ్యయం అంచనాలతో రానున్న 2024-25 సంవత్సరానికి రూ.62 లక్షల మిగులుతో అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి పద్దుల వారీగా చదివి వినిపించారు.

వివిధ అంశాలపై సమీక్ష

అజెండాలోని వివిధ అంశాలపై సభ్యులు సమీక్షించారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చేపట్టిన ముందస్తు కార్యాచరణ గురించి సభ్యులు అడగ్గా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరిస్తూ మూడు జిల్లాల పరిధిలో అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను మార్చి 31 నాటికి పూర్తిస్థాయిలో నింపగలమని తెలిపారు. తాగునీటి ఎద్దడి ఎదురయ్యే ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని వివరించారు. రబీ పంటలకు అవసరమైన విత్తనాలకు కొరత లేదని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో అమలవుతున్న పనులను ఆ శాఖ అధికారులు తెలియజేశారు. సమావేశంలో సభ్యులు సూచించిన అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఉన్నత పదవులకు జడ్పీ వేదిక

రాజకీయాల్లో ఉన్నత పదవులు అధిరోహించేందుకు జడ్పీ వేదిక అని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. తాను, ఎంపీ గీతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ వేదికగా ప్రజాసేవలోకి వచ్చామన్నారు. తమలాగే ప్రస్తుత పాలకమండలిలోని సభ్యులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న పథకాల లబ్ధి అందరికీ అందేలా కృషి చేయాలని సభ్యులను కోరారు. రాబోయే ఎన్నికల్లో ఈ వేదిక మీద తాను, ఎంపీ, జడ్పీ చైర్మన్ కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పోటీ చేయనున్నామన్నారు. సమావేశంలో కాకినాడ జిల్లా జేసీ ప్రవీణ్ ఆదిత్య, కోనసీమ జిల్లా జేసీ నూపూర్ అజయ్, తూర్పుగోదావరి జిల్లా జేసీ తేజ్‌భరత్, జడ్పీ వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఊపిరి పీల్చుకున్న జనం

కన్నాపురం రిజర్వ్ ఫారెస్ట్‌లోకి పులి ప్రవేశం

గోపాలపురం, ఫిబ్రవరి 4: కొన్ని రోజులుగా పెద్దపులి సంచారంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతూ, కంటి మీద కునుకు లేకుండా ఉన్న గోపాలపురం మండల ప్రజలు పెద్దపులి కన్నాపురం రిజర్వ్ ఫారెస్ట్‌కు ప్రవేశించిందన్న వార్తతో ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున కరగపాడు అటవీ ప్రాంతాన్ని దాటి బుట్టాయిగూడెం మండలం లక్ష్మీపురం వద్ద ఒక ఆవుపై దాడి చేసి చంపిన పెద్దపులి అనంతరం కన్నాపురం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్టు అటవీ శాఖాధికారులు చెబుతున్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం


వివరాలు చెబుతున్న పోలీసులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైలులో చట్ట విరుద్ధంగా తీసుకొస్తున్న తెలంగాణ మద్యం సీసాలను ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. సీఐ విజయ్‌శంకర్ వివరాల ప్రకారం.. ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో భాగంగా జీఆర్పీ డీఎస్పీ ఎల్.మోహన్‌రావు పర్యవేక్షణలో రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఆర్‌పీఎస్ఐ కె.మావుళ్లు తమ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం, బంగారం, నగదు అక్రమ రవాణాపై దృష్టి సారించారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి రైలులో రాజమహేంద్రవరం వచ్చిన రావులపాలెం మండలం వెదిరేశ్వరానికి చెందిన వాసంశెట్టి ధనరాజ్ లగేజీ బ్యాగ్‌ని తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి తీసుకొస్తున్న 6 మద్యం ఫుల్ బాటిళ్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని ధనరాజ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


సహపంక్తి భోజనాలు

లోవలో భక్తుల కోలాహలం

తలుపులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



తుని రూరల్, ఫిబ్రవరి 4: తూర్పు కనుమల్లో కొలువై భక్తుల ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్న తలుపులమ్మ అమ్మవారి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తల్లి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంతో పాటు క్యూలైన్లు కిక్కిరిసాయి. అమ్మవారిని భక్తులు దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం సమకూర్చిన వంట షెడ్‌లతో పాటు ఆలయ వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ ఈవో విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు చేశారు. ఆదివారం ఒక్క రోజే లోవకు తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా రూ.4.66 లక్షలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

తక్కువ పోస్టులతో ఉద్యోగ ప్రకటనలా?

ఇది నిరుద్యోగులను మోసగించడమే
ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు


పోటీ పరీక్షల పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4: వైసీపీ ప్రభుత్వం తన పదవీకాలం చివరిలో అతితక్కువ పోస్టులతో ఉద్యోగ ప్రకటనలు చేయడం నిరుద్యోగులను మోసం చేయడమే అని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు(ఐవీ) అన్నారు. ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో డీఎస్సీ, గ్రూప్స్ తదితర ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు నిరాశ మిగిల్చిందని విమర్శించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో గ్రూప్స్, డీవైఈవో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, వీరేశలింగం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఐవీ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఏటా జనవరిలో జాబ్ కేలండర్ ఇస్తామని, ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను వంచించిందన్నారు. అభ్యర్థుల వయో పరిమితి పెంచడానికి చర్యలు తీసుకోవాలని, గ్రూప్స్, డీఎస్సీలో మరిన్ని పోస్టులు పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పోటీ పరీక్షలపై అభ్యర్థులకు అవగాహన కల్పిస్తూ పోటీ పరీక్షలకు, అకడమిక్ పరీక్షలకు మధ్య ఉన్న తేడాను గమనించాలని సూచించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు రచించిన భారత సమాజం అనే పుస్తకాన్ని ఎమ్మెల్సీ ఐవీ, ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే పుస్తకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి ఆవిష్కరించారు. సదస్సులో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, నాయకులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

ఫైల్ సిద్ధం చేసిన అధికారులు

అన్నవరం, ఫిబ్రవరి 4: అన్నవరం దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఇతర క్యాడర్‌లలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అంతర్గత బదిలీలు చేపట్టేందుకు పరిపాలన విభాగ అధికారులు దస్త్రాలను సిద్ధం చేశారు. ప్రతి విభాగ ఉద్యోగిని మూడు నెలలకు ఒకసారి అంతర్గత బదిలీ చేయాలనే కమిషనర్ ఉత్తర్వులు మేరకు ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. ఇప్పటికే ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు అంతర్గత బదిలీలు పూర్తికాగా మిగిలిన సిబ్బందిని ఒకట్రెండురోజుల్లో బదిలీ చేయనున్నారు. సోమవారం ఈ దస్త్రంపై ఈవో రామచంద్రమోహన్ సంతకం చేయనున్నట్లు ప్రచారం జరుగుతుంది.

నేడు శంఖు, చక్ర, నామాలు ప్రారంభం

అన్నవరం దేవస్థానంలో సుమారు 70 లక్షలతో ప్రకాష్‌సదన్ కాటేజీపై ఏర్పాటుచేసిన శంఖు, చక్ర, నామాలను సోమవారం ప్రారంభించనున్నట్లు దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ట్రయిల్ రన్ నిర్వహించినట్లు చెప్పారు. 42 అడుగులు పొడవు, 90 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేశామన్నారు. ఈ శంఖు, చక్ర, నామాల వెలుగు సముద్రతీర ప్రాంతానికి కనిపిస్తుందని, జాతీయ రహదారిపై, రైలులో ప్రయాణించే ప్రయాణికులకు రాత్రి సమయంలో అన్నవరం చేరుకున్నామనే భావన కలుగుతుందన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం



రంపచోడవరం, ఫిబ్రవరి 4: భూపతిపాలెం రిజర్వాయర్‌లో ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఆత్మహత్యకు పాల్పడిందా లేక ఎవరైన హత్య చేసి రిజర్వాయర్‌లో పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నెంబర్లు 9440900762, 9381483283కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పంట సాగు కోసం అప్పుల పాలై..

● భార్యాభర్తల మధ్య గొడవ ● పురుగుల మందు తాగి భర్త మృతి



ఎటపాక, ఫిబ్రవరి 4: పంటల సాగు కోసం చేసిన అప్పుల విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగి... చివరకు క్షణికావేశంలో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి ఎటపాక మండలం, రాంగోపాలపురం పంచాయతీ నర్సింగ్‌పేట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొంది కామేశ్వరరావు(39) గత నాలుగేళ్లుగా అప్పులు చేస్తూ వ్యవసాయం చేస్తున్నాడు. గత నాలుగేళ్ల నుంచి పంటల్లో నష్టం రావడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఈఏడాది మరలా అప్పులు చేసి, మిర్చి, పత్తి, వరి సాగు చేశాడు. అయితే ఈసారి కూడా తెగుళ్లు, తుఫాన్ ప్రభావంతో పంట నష్టం వాటిల్లింది. దాంతో శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య అప్పుల విషయంలో వివాదం జరిగింది. దాంతో కామేశ్వరరావు కొద్దిసేపటికి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రాధ, కూతురు నందిత్య, కొడుకు సాద్విక్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4: రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు వద్ద నున్న శ్రీ గౌతమీ వ్యాయామ కళాశాల ఆవరణలో 15వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు ఆదివారం రాత్రి నిర్వహించారు. జాంపేట కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె మధు, బిగ్ వింగ్ ఎండీ బులి వెంకటరావు, ప్రవీణ్ నాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిస్టర్ ఇండియా రామాంజనేయులును సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది బాడీ బిల్డర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలైన వారు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో కేరళ రాష్ట్రంలోని కాలికట్‌లో నిర్వహించే సౌత్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీలకు, మార్చి 15, 16, 17 తేదీల్లో తిరుచూర్‌లో జరిగే ఆలిండియా పోటీలకు ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా వెళతారని పేర్కొన్నారు.

ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమస్యలపై ప్రత్యేక దృష్టి

యూపీఈఐఎఫ్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ శ్రీవిజయ్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: పోలవరం ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ అన్నారు. ఈ మేరకు పోలవరం ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కాకినాడలో యూపీఈఐఎఫ్ కార్యనిర్వాహక సభ్యులను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ లీగల్ అడ్వైజర్ శ్రీవిజయ్ మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతామని, సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తామని ప్రకటించారు. దీంతో ఫెడరేషన్ లీగల్ అడ్వైజర్, కార్యనిర్వాహక సభ్యులకు పోలవరం ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు రిఫరీలుగా ఎంపిక

రామచంద్రపురం, ఫిబ్రవరి 4: ఈ నెల 7 నుంచి 11 వరకు న్యూఢిల్లీలో గల జాదవ్ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంటర్నేషనల్ రిఫరీలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎన్.గిరివెంకటరమణ, బి.కె.రత్నం, వై.అంజనీకుమార్ ఎంపికైనట్లు కోనసీమ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి తెలిపారు. వారిని వైజాగ్ కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు ఆనందబాలు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అభినందించారు.

బెండమూర్లంకలో 'శశివదనే' షూటింగ్



అల్లవరం, ఫిబ్రవరి 4: గౌరీనాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి నిర్మాణ సారథ్యంలో ఉబ్బన సాయిమోహన్ దర్శకత్వంలో 'శశివదనే' సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణతో బెండమూర్లంకలో షూటింగ్ సందడి నెలకొంది. పలాస ఫేమ్ రక్షిత్ హీరోగా, కోమలి ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తుండగా వారిపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో రక్షిత్, తమిళ నటుడు శ్రీమాన్, సుబ్రహ్మణ్యం, నాయుడులపైనా కొన్ని దృశ్యాలు తీశారు. కెమెరామెన్‌గా శ్రీసాయికుమార్ దారా, మ్యూజిక్ డైరెక్టర్‌గా చరవణ వాసుదేవాన్ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా త్వరలోనే విడుదలవుతుందని నిర్మాత తేజ చెప్పారు.



వెంకన్న ఒక్కరోజు ఆదాయం

రూ.2.89 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4: కోనసీమ తిరుపతి వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,89,111 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

భీమేశ్వరాలయానికి విదేశీ భక్తులు


ఆలయంలో విదేశీ భక్తులు

సామర్లకోట, ఫిబ్రవరి 4: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం ఇటలీ దేశానికి చెందిన లూయిజా కుటుంబానికి చెందిన నలుగురు విదేశీ భక్తులు స్వామివారిని, బాలాత్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిజా విలేకరులతో మాట్లాడుతూ తమ కుటుంబం ఇటలీలో ప్రముఖ ఆధ్యాత్మిక కుటుంబంగా పేర్గాంచిందని తాము చరిత్ర అధ్యయనం చేస్తూ పంచారామాల విశిష్టత గురించి తెలుసుకున్నామన్నారు. పంచారామాలలో సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం ఎంతో గొప్పదని తాము చదివిన చరిత్రను స్వయంగా వీక్షించి తన్మయత్వం చెందామని చెప్పారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ శిల్పకళా సంపదను చూసి వాటి వద్ద నిల్చుని ఫొటోలు తీసుకునేందుకు అత్యంత ఉత్సాహం కనబర్చారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు


పరుగులు తీస్తున్న ఎడ్లు

సీనియర్స్‌లో గుమ్మిలేరు, జూనియర్స్‌లో జమ్మిగొల్లేపల్లి విజేతలు

సామర్లకోట, ఫిబ్రవరి 4: కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామభీమేశ్వర రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉండూరు రైల్వేగేట్-ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆదివారం వందలాది మంది రైతులు, పశు పోషకుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం చంద్రమౌళి సౌజన్యంతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలకు మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, ప్రముఖ వ్యాపారవేత్త చందలాడ పద్మరాజు (బాబ్జీ) హాజరయ్యారు. నిర్ణీత దూరాన్ని తాకి తిరిగి వచ్చేందుకుగాను నిర్వహించిన ఈ పోటీలలో జూనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరాశృతి చౌదరి ఎడ్లు 5.37.59 పాయింట్లతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా ద్వితీయ, తృతీయ స్థానాలను వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్ సామర్లకోట ఎడ్లు 5.44.97 పాయింట్లతోనూ, కోరా శృతి చౌదరి గుమ్మిలేరు ఎడ్లు 5.49.51 పాయింట్లతోనూ కైవసం చేసుకున్నాయి. అలాగే జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని జమ్మిగొల్లేపల్లి నలజాల నరసింహారావు ఎడ్లు 4.13.72 పాయింట్లతోనూ, ద్వితీయ స్థానాన్ని మండపేట వేగుళ్ల నారయ్య చౌదరి ఎడ్లు 4.17.19 పాయింట్లతోనూ, తృతీయ స్థానాన్ని వెల్లుర్తి మొగలి ఏసుబాబు ఎడ్లు 4.23.13 పాయింట్లతోనూ కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమాన్ని డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం, చందలాడ పద్మరాజు(బాబ్జీ) చేతులమీదుగా నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు. సీనియర్స్ విభాగంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 9 జతల ఎడ్లు, జూనియర్స్ విభాగంలో 30 జతల ఎడ్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. పోటీల నిర్వాహకులుగా కాటూరి జానకీరామ్, కొండపల్లి కృష్ణమూర్తి, గోలి వెంకటఅప్పారావుచౌదరి, పైణ్ణి చిట్టియ్య, బిక్కిన శ్రీరంగనాయకులు, పైణ్ణి గౌరీచంద్, రామకృష్ణ వ్యవహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. సామర్లకోట పరిసర ప్రాంతాల నుంచి రైతులు, పశు పెంపకందారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సీనియర్స్ విభాగంలో విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

జనసేన నేత బాలకృష్ణ పరామర్శ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పలువురిని జనసేన పార్టీ పీఏసీ కమిటీ సభ్యుడు పితాని బాలకృష్ణ ఆదివారం పరామర్శించారు. రాజేలంక గ్రామానికి చెందిన గోదశి సూర్యచంద్రరావు, వడ్డిగూడెం గ్రామానికి చెందిన శీలం మూలాస్వామి, పాటి వెంకటరమణవరప్రసాద్ అనారోగ్యానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్న వారిని పితాని బాలకృష్ణ పరామర్శించారు. రాజుపాలేనికి చెందిన వనచర్ల నాగు కంటికి సర్జరీ చేయించుకోగా అతన్ని కూడా బాలకృష్ణ పరామర్శించారు.

జనసేనలో పలువురి చేరిక

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4: ముమ్మిడివరం మండలానికి చెందిన పలువురు ఆదివారం జనసేన పార్టీలోకి చేరారు. మండలానికి చెందిన విత్తనాల అర్జున్, కడలి రామకృష్ణ ఆధ్వర్యంలో వడ్డిగూడేనికి చెందిన పాటి సతీష్ పార్టీలోకి చేరగా జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ కండువా కప్పి ఆహ్వానించారు. అదే గ్రామానికి చెందిన పలువురు బీసీ యువత పార్టీలో చేరారు. అలాగే పల్లిపాలెం గ్రామానికి చెందిన జవ్వాది జానకీతో పాటు పలువురు పార్టీలో చేరగా వారికి బాలకృష్ణ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో జక్కంశెట్టి పండు, దూడల స్వామి, కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం, పితాని రాజు, పితాని శివ, జక్కంపూడి కిరణ్, చింతలపూడి వెంకటేశ్వరరావు, బొక్కా శ్రీను, గుత్తుల సత్తిబాబు, కముజు సత్తిబాబు, యిళ్ల రాంబాబు, కడలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 4: గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కొత్తపేట ఆర్డీవో జి.వి.వి.సత్యనారాయణ సూచించారు. ముంగండ సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. గ్రామాలు వారీగా ఎంతమేర రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయో డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో వెంట వీఆర్వోలు దొరబాబు, వెంకటేశ్వరరావు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక

పి.గన్నవరం, ఫిబ్రవరి 4: మానేపల్లి హైస్కూల్లో 1990లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బాలికల హైస్కూల్లో కలుసుకుని సందడి చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో పూర్వవిద్యార్థుల సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా దేవళ్ళ శ్రీనివాస్, అధ్యక్షుడిగా ముత్యాల రామం, ఉపాధ్యక్షుడిగా పితాని శ్రీనివాస్, ట్రెజరర్‌గా ఉప్పె జగదీష్, కార్యదర్శిగా గంధం రవికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేన్సర్ నివారణా దినోత్సవ ర్యాలీ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4: ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ యెనుముల నరసింహారావు, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ రాఘవేంద్రరావు అవగాహన సదస్సులో మాట్లాడారు. అనంతరం చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం నుంచి ర్యాలీని ప్రారంభించారు. వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి వలవల వెంకటరెడ్డినాయుడు, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, ప్రొఫెసర్ డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, క్లబ్ ప్రతినిధులు సప్పా నాగేశ్వరరావు, పుత్సా కృష్ణకామేశ్వర్, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, రంకిరెడ్డి కాశీ, జి.గంగాధర్, పట్నాల రమణ, వాసిరెడ్డి ఈసు తదితరులు పాల్గొన్నారు.

7న అఖండ హోమం మహాపూర్ణాహుతి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4: స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీఆదిశేషా నిలయంలో పుష్యమాస బహుళ అష్టమిని పురస్కరించుకుని అహోరాత్రులు నిర్వహిస్తున్న మాతా కామాఖ్యాదేవి అఖండ పూర్ణాహుతి బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుందని శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ప్రతినిధులు పోతురాజు రామకృష్ణ, కనకదుర్గ దంపతులు తెలిపారు. తాడేపల్లిగూడేనికి చెందిన మార్నీడి సూర్యనారాయణ, సత్యవతి కుటుంబ సభ్యులు రూ.60వేలు విలువైన మాతా కామాఖ్యాదేవి, కాలభైరవుల విగ్రహాలను అందజేశారు. కామాఖ్యాదేవి విశిష్టతను సలాది సాయిరామ్ భక్తులకు వివరించారు.

మర్యాద పూర్వకంగా..

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4: జై భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా ఆదివారం అమలాపురంలోని రాష్ట్ర కాపు సంఘ నాయకుడు కల్వకొలను తాతాజీని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తొలుత లక్ష్మీనారాయణను కాపు నాయకులు సత్కరించారు. అనంతరం రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై ఏకాంతంగా ఆయన చర్చించారు. కార్యక్రమంలో ఆర్లపల్లి ముత్యం, కల్వకొలను చిన్ని, వర్రే శేషు, వీరంశెట్టి సతీష్ పాల్గొన్నారు.

మేనిఫెస్టో అందజేత

ముమ్మిడివరంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి బాలయోగిని ఆదివారం జై భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ కలిశారు. పీపుల్స్ మేనిఫెస్టోను న్యాయమూర్తికి అందించారు.

బీసీలను ఆదుకున్నది టీడీపీయే

మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు




ముమ్మిడివరం: మాట్లాడుతున్న దాట్ల బుచ్చిబాబు, ఆత్రేయపురం: మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4: బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఆర్థిక చేయూతనిచ్చింది తెలుగుదేశం పార్టీ ఒక్కటేనని మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో బీసీ సెల్ అధ్యక్షుడు దంగేటి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన జయహో బీసీ సదస్సులో దాట్ల బుచ్చిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ పాటుపడితే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక బీసీలకు మరింత సముచిత స్థానం కల్పించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు జరిపితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 10శాతం తగ్గించి 16వేల స్థానిక సంస్థల పదవులు బీసీలు కోల్పోయేలా చేసిందన్నారు. మరో ముఖ్య అతిథి, జనసేన రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, ప్రశ్నించే వారిపై దాడులు జరుగుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం పార్టీల ప్రభుత్వం ఏర్పాటుచేస్తే ప్రతీ ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. సదస్సులో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, రాష్ట్ర నాయకులు గుత్తుల సాయి, మందాల గంగసూర్యనారాయణ, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పిల్లి నాగరాజు, పొద్దోకు నారాయణరావు, సానబోయిన మల్లికార్జునరావు, వాడ్రేవు వీరబాబు, గంజా సుధాకర్, దూడల స్వామి, పొన్నమండ రామలక్ష్మి, జక్కంశెట్టి పండు, టేకుమూడి లక్ష్మణరావు, మట్ట సత్తిబాబు, చింతకింద రామకృష్ణ, ధూళిపూడి బాబి, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, చిక్కాల అంజిబాబు, దాట్ల బాబు, రెడ్డి సుధీర్, యాళ్ల ఉదయ్, గొల్లపల్లి గోపి, మిమ్మితి చిరంజీవి, కురసాల శివ పాల్గొన్నారు.

బీసీలే టీడీపీకి పట్టుకొమ్మలు

మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4: బీసీలే తెలుగుదేశం పార్టీకి పట్టుకొమ్మలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. వసంతవాడలో ఆదివారం నిర్వహించిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. తొలుత జ్యోతిరావుపూలే, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వెన్నంటే ఉం టున్న బీసీలకు టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక రక్షణ చట్టంతో బీసీలకు చంద్రబాబు న్యాయం చేస్తారన్నారు. వైసీపీ పాలనలో బీసీలపై జరుగుతున్న దాడులు దృష్ట్యా భవిష్యత్‌లో ఇటువంటి ఇబ్బందులు పడకూడదనే రక్షణ చట్టాన్ని తీసుకువస్తారన్నారు. అభివృది కోసం ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని అక్రమాలపై ఆందోళన చేస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కేతా శ్రీను, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కాసా సాగర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఐనం నాగరాజు, రెడ్డి రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామయ్య, చిటికెన సత్యనారాయణ, యల్లమిల్లి జగన్, మిద్దే ఆదినారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, రెడ్డి తాతాజీ, కముజు వెంకటేశ్వరరావు, దండు రాంబాబు, తోటకూర సుబ్బరాజు, అధిక సంఖ్యలో బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

చికిత్స పొందుతూ మహిళ మృతి

అంబాజీపేట, ఫిబ్రవరి 4: ఉరి వేసుకున్న మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. గుడివాడకు చెందిన గుత్తుల జోత్స్నసత్యశ్రీ(18) పుట్టింటికి జనవరి నెలలో వచ్చింది. గతనెల27న ఇంటిలో ఉరి వేసుకుంది. బంధవులు, స్థానికులు ఆమెను కాకినాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. తల్లి మామిడిశెట్టి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏ.చైతన్యకుమార్ తెలిపారు.

పందుల స్వైరవిహారం

అంబాజీపేట, ఫిబ్రవరి 4: మాచవరం పరిధిలో పందుల స్వైరవిహారం చేసి అరటి పంటను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్.వెంకట్రావుకు చెందిన నాలుగు ఎకరాల అరటి తోటను పందులు ధ్వంసం చేయడంతో లక్షలాది రూపాయలు నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పందుల బెడదను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.55లక్షలతో అన్నదాన భవన నిర్మాణం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 4: మురమళ్ళ శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన భవనాన్ని రూ.55లక్షలతో నిర్మించారు. చైర్మన్ వాసురాజు సహకారంతో ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.5లక్షలతో గోకులం నిర్మాణం చేశారు. ఈనెల5న ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నదాన భవనాన్ని, గోకులం భవనాన్ని ప్రారంభిస్తారని ఈవో తెలిపారు.

చైర్‌పర్సన్‌ను కలిసిన కమిషనర్

మండపేట, ఫిబ్రవరి 4: మండపేట మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి.రాము ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణిని మర్యాదపూర్వంగా కలిశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు



ఏడిదలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్యకర్తలు

మండపేట, ఫిబ్రవరి 4: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో ఆదివారం మండపేట, ఇప్పనపాడు, ఏడిద గ్రామాలకు చెందిన వంద మంది వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు.స్థానిక గొల్లపుంతకాలనీకి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎం.సూర్యప్రకాష్ సారథ్యంలో 20 మంది వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరగా వారికి వేగుళ్ల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండపేట, ఏడిద, ఇప్పనపాడుకు చెందిన చిట్టూరి శ్రీను, మునిని అంజిబాబు, ఇళ్ల సాయికుమార్, సురేష్ చక్రవర్తి, సాయి కిషోర్, సాగిరి, శివకుమార్, మరుకుర్తి ప్రసాద్, దున్న పాపారావు, జి.బాబ్జి, గోణం లోవరాజు, జిప్రసాద్, బీమవరపు శివలు టీడీపీలో చేరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, యు.రాంబాబు, కుక్కల రామారావు, ఇప్పనపాడు ఉపసర్పంచ్ కుంచే ప్రసాద్, బీసీ సాధికారిత కమిటీ నియోజకవర్గ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వై.ఆర్.కె. పరమహంస. మాజీ సర్పంచ్‌లు వాసంశెట్టిశ్రీనివాస్, వాసంశెట్టి సత్యనారాయణ, గుత్తులశ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏడిదలో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ

వైసీపీ ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఏడిదలో ఆరో రోజు ఆదివారం నిర్వహించిన బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. వచ్చేఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేన కూటమిని గెలిపించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడించాలని కోరారు. ఎన్నికలుఎప్పుడు వచ్చినా టీడీపీ, జనసేన కూటమి గెలుపు ఖాయమన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను వేగుళ్ల ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి గొల్లపల్లి పరామర్శ

మామిడికుదురు, ఫిబ్రవరి 4: మాతృవియోగంతో బాధపడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్‌ను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆదివారం పరామర్శించారు. శ్రీనివాస్ మాతృమూర్తి మంగాయమ్మ ఇటీవల మృతిచెందడంతో ఆమె చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. బోనం బాబు, పాటి గోవిందు, కోలా రాంబాబు, పాటి వెంకట్రావు, గెడ్డం సూరిబాబు, చాగంటి స్వామి, పితాని సూరిబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 4: సరిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు శ్రీహరిరాయలు, పావని, అనీల్‌కుమార్, నీలిమ వైద్య సేవలందించారు. సర్పంచ్ గెడ్డం స్వరూపాసురేష్ రోగులకు మందులు పంపిణీ చేశారు. గొల్లవిల్లి హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరంలో వంటెద్దు అమృతవల్లి వైద్య సేవలందించారు.

వాసవీక్లబ్ గోల్డెన్ వనిత కార్యవర్గం ప్రమాణం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4: అమలాపురం వాసవీ క్లబ్ గోల్డెన్ వనిత ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. వాసవీ క్లబ్ ప్రముఖులు బోడ సాయిసూర్యప్రకాష్, కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్, నంబూరి నాగేశ్వరరావు, మండవల్లి మురళీకృష్ణకుమార్ హాజరై మాట్లాడారు. అధ్యక్షురాలిగా బచ్చుపార్వతి, కార్యదర్శిగా చెన్న వెంకటలక్ష్మి, కోశాధికారిగా కంచర్ల లక్ష్మీరాధ ప్రమాణం చేశారు. కె.ప్రశాంత్, యెండూరి రాఘవ, యెండూరి సీత, నూలు వరలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు.

జూడో యాత్రకు సంఘీభావ ర్యాలీ

రామచంద్రపురం, ఫిబ్రవరి 4: భారతజూడో న్యాయ యాత్రకు సంఘీభావంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ కోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మల్లవరపు ప్రకాష్, ఖురేషి, పాలిక శివయ్య, పెంకె ప్రసాద్, దొంగ శ్రీను, యనమదల బాల, కార్యకర్తలు పాల్గొన్నారు.

శైలి వేరైనా.. మనసును హత్తుకునేదే నిజమైన కవిత్వం



సభలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సాహితీ రంగంలో ఎవరిశైలి వారిదే అయినా మనసును హత్తుకునేదే నిజమైన కవిత్వమని ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. గోదారోళ్ల యాసను, ప్రాసను ప్రపంచమంతా గుర్తించేలా చేసింది మన సహజ కవులేనన్నారు. అమలాపురం రోటరీ కల్యాణ మండపంలో ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ జర్నలిస్టు ముక్కామల చక్రధర్ రచించిన 'చక్రవాకం' పుస్తకావిష్కరణ సభ ఆదివారం సీనియర్ జర్నలిస్టు ప్రసేన్ అధ్యక్షతన నిర్వహించారు. ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులు, వినూత్న పోకడలను టీటీడీ శ్వేత డైరెక్టర్ భూమన్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంతఉపకులపతి ఆచార్య పి.కుసుమకుమారితో పాటు ఎస్పీ శ్రీధర్ వివరించారు. సమాజంలో మార్పుతో పాటు చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయడంతో పాటు ఆధునిక పోకడలను ఎప్పటికప్పుడు కళ్లకు కట్టినట్టు తన కవిత్వంతో చూపిస్తున్న చక్రధర్‌ను ప్రశంసించారు. చక్రవాకం పుస్తక సమీక్షను ప్రముఖ కవులు సీతారామ్, అద్దేపల్లి ప్రభు నిర్వహించారు. చక్రధర్ సోదరి శ్యామలాదేవిని సత్కరించారు. ప్రముఖ కవులు పెమ్మరాజు గోపాలకృష్ణ, వసీరా, డాక్టర్ కాళ్లకూరి శైలజ, సీనియర్ న్యాయవాది కూచిమంచి మల్లపరాజు, జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, ఈవని విశ్వేశ్వరశర్మ పాల్గొనగా ఆకొండి పవన్‌కుమార్ వందన సమర్పణ చేశారు.

నష్టపరిహారం చెక్కుల పంపిణీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 4: మిచాంగ్‌తుపానుకు ఇళ్లు దెబ్బతిన్న తాడిపల్లికి చెందిన కొప్పిశెట్టి కాంతం, పులి కృష్ణమోహన్, పిల్లి వెంకటరెడ్డిలకు ఆదివారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్, పీఏసీసీఎస్ చైర్మన్ పిల్లి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. హసన్‌బాదలో సూర్యప్రకాష్ గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్, ఎంపీటీసీ వెన్నం పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలకు సమాజంలో గుర్తింపు

యానాం, ఫిబ్రవరి4: అంకితభావంతో సేవలందిస్తున్న నర్సులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి అన్నారు. స్థానిక హైస్కూల్ రోడ్డులోని మదర్‌థెరిసా పోస్టు గ్రాడ్యుయేషన్, రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో లాంప్ లైటింగ్ సెర్మనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల నర్సింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఈప్రమీల తమిళవన్నన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మునిస్వామి మాట్లాడారు. బాధ్యతగా శిక్షణ పూర్తిచేస్తామని కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. యానాం కళాశాల ప్రిన్సిపాల్ కనకాల శ్రీనివాసరావు, ప్రతినిధులు విజయలక్ష్మి, బాపిరాజు, అమర్, ధనకుమార్, ధనలక్ష్మీ, సత్యశ్రీ, దుర్గేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత శివాళినీకి సన్మానం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4: శ్రీస్వామి వివేకానంద సంఘమిత్ర జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న ఇందుపల్లి సర్పంచ్ చొల్లంగి శివాళినీకి పౌర సన్మానం నిర్వహించారు. ఆదివారం బీసీ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో శివాళినీ-అప్పాజీ దంపతులకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఉపసర్పంచ్ ఉర్రింకి బుజ్జి, ఆకెళ్ల నారాయణమూర్తి, ఎంపీటీసీ కె.రాంబాబు, మల్లుల పోలయ్య, మల్లుల రామకృష్ణ, శ్రీపాద సత్యనారాయణ, కుడుపూడి శ్రీనివాసరావు, పెదమల్లు నాగేంద్ర, చొల్లంగి రాధాకృష్ణ, శిరగం బాబ్జి, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

అల్లవరం, ఫిబ్రవరి 4: గోడి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసే వారికి మాత్రమే ఇంటర్‌లో ప్రవేశానికి అర్హత ఉంటుందన్నారు. ఈనెల 23వరకు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో జరుగుతుందని చెప్పారు.

బ్రహ్మోత్సవాలకు రూ.1.50లక్షల విరాళం



ఆలమూరు, ఫిబ్రవరి 4: చింతలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల29 నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆలమూరుకు చెందిన మురళీకృష్ణరైస్ మిల్లు అధినేత వంటిపల్లి పాపారావు రూ.1.50లక్షలు విరాళం అందించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదు రోజులు జరిగే అన్నదాన కార్యక్రమానికి ఈవిరాళం వినియోగించనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ తెలిపింది. దాత పాపారావును పలువురు అభినందించారు.

మద్యం విక్రయించిన వ్యక్తి అరెస్టు

కె.గంగవరం, ఫిబ్రవరి 4: శేరిలంకలో మద్యం విక్రయిస్తున్న పోతుల సత్యనారాయణమూర్తిని ఆదివారం అరెస్టు చేసినట్టు పామర్రు ఎస్ఐ జానీబాషా చెప్పారు. కేసు నమోదు చేసి, 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ఎమ్మెల్యే పొన్నాడకు సన్మానం

ఐ.పోలవరం ఫిబ్రవరి 4: ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌ను ఆదివారం మండల సొసైటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మురమళ్ళ సొసైటీ వద్ద జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణిమిరియంజ్యోతి, పిన్నమరాజు శ్రీనురాజు, ధూళిపూడి చక్రం, కడియం తమ్మయ్య, పెన్మెత్స చిట్టిరాజు, దున్నా జనార్ధనరావు, గోదశి నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు సుంకర నాగబాబు, కసిలంక నరసింహమూర్తి, ముదునూరి వరహాలరాజు, వడ్డి గౌతమ్ పాల్గొన్నారు.

ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేసిన గొల్లపల్లి

రాజోలు, ఫిబ్రవరి 4: రాజోలు నియోజకవర్గం మన టీడీపీ యాప్ ప్రతినిధులుగా పనిచేస్తున్న కార్యకర్తలకు టేబుల్ జెండా, సైకిళ్లను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆదివారం తాటిపాకలో ఆయన స్వగృహం వద్ద అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను మన టీడీపీ యాప్ ద్వారా సోషల్ మీడియాలో పనిచేస్తున్న 14మంది సభ్యులకు టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన టీడీపీ టేబుల్ జెండా, సైకిళ్లను బహుమతిగా అందజేశామన్నారు. కార్యక్రమంలో బందెల పద్మ, జంపన సత్యనారాయణరాజు, చాగంటి స్వామి, నాగిరెడ్డి గోపి, పిండి సత్యనారాయణ, అల్లూరి మోహన్‌రాజు, కడలి కృష్ణ మోహన్, పప్పుల రమేష్, ఆరుమిల్లి వెంకటకృష్ణచౌదరి, పితాని సూరిబాబు, బోళ్ల గంగాచలం, దేవళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కుంచే గంగాజలం, పి.సుధాకర్, కడలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, ఫిబ్రవరి4:చోడవరం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్లకొమ్మలు తొలగింపునకుమంగళవారం ఉదయం 8నుంచి 1గంటవరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ విజయానంద్ తెలిపారు. చోడవరం, నరసాపురపుపేట, ఓదూరు, యనమదల, వాటర్ ట్యాంకు, రొయ్యల, చేపలచెరువులకు సరఫరా ఉండదన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి

రాయవరం, ఫిబ్రవరి 4: హైందవ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్య రామకృష్ణ శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం పసలపూడిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి విల్లూరి వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్చకులందరికీ గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. పల్నాడు ఏరియాలో అన్యాక్రాంతమైన అర్చక భూములను పరిరక్షించి అర్చకులకు అందజేయాలన్నారు. సంఘం నేతలు పత్రి అనిల్‌కుమార్, మురికిపూడి కృష్ణకిషోర్, పలు ప్రాంతాలకు చెందిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీ పేరిట జగన్‌రెడ్డి మెగా మోసం

తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రిష్వంత్‌రాయ్



రామచంద్రపురం, ఫిబ్రవరి 4: డీఎస్సీ పేరిట జగన్‌రెడ్డి యువతను మోసం చేస్తున్నాడని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలులేవని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ అన్నారు. మెగా డీఎస్సీ ఇస్తానని యువతకు జగన్‌రెడ్డి హామీఇచ్చి నాలుగున్నరేళ్ల తర్వాత 6,100పోస్టులు భర్తీ చేస్తామంటే నిరుద్యోగులను మోసంచేయడం కాదా అని ప్రశ్నిం చారు. నాలుగున్నరేళ్ల నుంచి రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారన్నారు.

ప్రత్యేకహోదా కోసం కాంగ్రెస్ పోరు

మండపేట, ఫిబ్రవరి 4: ఏపీకి ప్రత్యేక హోదా వచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ పోరు ఆగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ చివరి సమావేశాల్లో కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలు ఏపీకి ప్రత్యేక హోదా గురించి ప్రస్తావిస్తాయన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా, సాగునీటి ప్రాజెక్టులు, పోర్టులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి అనేక సమస్యలను కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంఅధికారంలోకి రాగానే పరిష్కరిస్తుందన్నారు.రాహుల్ ప్రధాని కావటం ఖాయమన్నారు.

చెట్టుపై నుంచి జారిపడిన వ్యక్తికి తీవ్రగాయాలు

అల్లవరం, ఫిబ్రవరి 4: యెంట్రుకోనకు చెందిన తిక్కిరెడ్డి ఈశ్వరరావు ఆదివారం కొబ్బరిచెట్టు ఎక్కి బొండాలు దించుతుండగా ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. వెన్నుపూస చిట్లి తీవ్రంగా గాయపడ్డాడు.అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపు సర్పంచ్‌ల 'చలో అసెంబ్లీ'

అమలాపురం రూరల్, ఫిబ్రవరి4: పంచాయతీల నిధులను దారిమళ్లించి స్థానిక సంస్థలను నిర్వీర్యంచేసిన రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం చేపట్టిన 'చలో అసెంబ్లీ'ని విజయవంతం చేయాలని సర్పంచ్‌ల సమాఖ్య అమలాపురం నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామచంద్రరావు (రాము) పిలుపునిచ్చారు. సచివాలయాలను, వలంటీర్లను పంచాయతీ సర్పంచ్‌ల ఆధీనంలోకి తీసుకురావాలని, కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు జమ చేయాలని, గౌరవ వేతనం పెంచాలని కోరుతూ ఈకార్యక్రమం తలపెట్టినట్టు ఆయన చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మండపేట, ఫిబ్రవరి 4. మండపేట పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించ కూడదని నిబంధన ఉంది. ఎందుకంటే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు మండల పరిషత్ సమావేశాలకు హాజరవుతారని ఈనిబంధన పెట్టారు. అయితే ఈనిబంధనకు విరుద్ధంగా మండపేట పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనుండంపై విమర్శలు వస్తున్నాయి.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

అంతర్వేది, ఫిబ్రవరి 4: సఖినేటిపల్లి మండలం ఎస్టీయూ కౌన్సిల్ సమావేశం మోరి ఎంఎల్‌టీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జరిగింది. సమావేశంలో ప్రస్తుత విద్యా విధానంపై చర్చించారు. అనంతరం సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా కడలి వెంకటనాగేశ్వరరావు, మండల అధ్యక్షుడిగా గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఉండపల్లి గిరిబాబు, కోశాధికారిగా యూవీ కృష్ణప్రసాద్, అభయ్ కన్వీనర్‌గా కంచి నాగరాజు, ఉపాధ్యాయవాణి కన్వీనర్‌గా జట్టి వీర్రాజులను, కౌన్సిలర్లగా నరహరిశెట్టి సత్యనారాయణ, గుర్రం పెద్దిరాజు, ఈద వివేకానంద, ఉండపల్లి వెంకటసత్యనారాయణ, అల్లు శ్రీను, ఉద్దండపు రమణ, మన్నే సత్యనారాయణ, చింతా కోటేశ్వరరావు, గునిశెట్టి నాగమల్లికార్జునరావులను ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలిగా ఎండీ బషీర్‌బేగంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎస్టీయూ సభ్యులు తెలిపారు.

కోల సంబరం కళాకారులను ఆదుకోవాలి

ద్రాక్షారామ, ఫిబ్రవరి 4: కోల సంబరం కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని వెంకటేశ్వర, దుర్గా జిల్లా కోల సంబరం కళాకారుల అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. ఆదివారం కోల సంబరం కళ పుట్టిన వెల్ల గ్రామంలో కళాకారుల తొలి సమావేశం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగింది. కోల సంబరం కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 50ఏళ్లు నిండిన కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలని, నివేశనాస్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. సమావేశంలో కోలా సంబరం కళాకారుల సంఘం అధ్యక్షుడు ఈతా దుర్గారావు, ఉపాధ్యక్షుడు వాసంశెట్టి లక్ష్మణరావు, అధిక సంఖ్యలో కోలా సంబరం కళాకారులు పాల్గొన్నారు. కోల సంబరం కళ మూలపురుషుడు చిక్కాల కాటయ్య కుమారులు కామయ్య, జానకిరామయ్య, పట్టాభిరామయ్యల వారసులను సత్కరించారు. కార్యక్రమం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకికి కె.విశ్వనాథ్ స్మారక పురస్కారం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 4:భీమనపల్లికి చెందిన కోనసీమ రచయితల సంఘం సభ్యుడు అద్దంకి అమరేశ్వరరావుకు కళాతపస్వి కె.విశ్వనాథ్ స్మారక సేవా పురస్కారం లభించింది. రాజమహేంద్రవరంలో ఆదివారం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. అద్దంకిని కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, జల్లి సుజాత అభినందించారు.